# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం సమీక్ష నిర్వహిస్తారు.

**2.** **తోతాపురి మామిడి ధరను క్వింటాకు ఒక వెయ్యి 490 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**

**3.** **రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4.** **రాష్ట్ర ప్రజలకు విధానపరమైన నిర్ణయాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని రహదారులు, భవనాలశాఖ శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**

**5.** **తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన టీటీడీ పాలకమండలి ఈరోజు సమావేశమైంది.**

==========================

తెలుగు దేశం పార్టీకి చెందిన శాసనసభ్యులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమావేశమైయ్యారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నరసరావుపేట, పాతపట్నం శాసనసభ్యులతో సమావేశమై పార్టీ బలోపేతం, నియోజకవర్గంలో సమస్యలు, పరిష్కారాలు వంటి అంశాలపై చర్చించారు.

కాగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖపై ఈ మధ్యాహ్నం సమీక్ష నిర్వహిస్తారు. ఈ సాయంత్రం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ యూఏఈ దేశ ఆర్థిక మంత్రితో సమావేశం అవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి ధరను క్వింటాకు ఒక వెయ్యి 490 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి ధరను ప్రకటించిందని చెప్పారు. దీని ద్వారా 50 : 50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదును చెల్లిస్తాయని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

వాయిస్ .31.. సెకన్లు

మరోవైపు తోతాపూరి మామిడికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు.

---------------------------

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కృష్ణాజిల్లా పెడనలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెడనలో వచ్చే రెండేళ్ళల్లో ఇంటింటికి తాగునీరు అందించేలా పనులు చేపడుతున్నామని తెలిపారు. అలాగే పెడన పురపాలక సంఘంలో మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్ర ప్రజలకు విధానపరమైన నిర్ణయాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని రహదారులు, భవనాలశాఖ శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వరున్ని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. ప్రజలకు పింఛన్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 27 సెకన్లు

---------------------------

నేరాల నియంత్రణకు, పరిష్కారానికి సాంకేతికతను వినియోగించుకునేలా యువ ఐపీఎస్ అధికారులు దృష్టిసారించాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న 28 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు తమ శిక్షణలో భాగంగా.. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ, ఇతర సీనియర్ అధికారులతో నిన్న మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారులకు డీజీపీ పలు సూచనలు చేశారు. పోస్టింగ్ పొందిన ప్రాంతాల్లోని స్థానిక భాషల మీద పట్టు సాధించాలన్నారు. పోలీసు శాఖ చేపట్టిన అస్త్రం యాప్, కృత్రిమ మేధ ఏఐ హ్యాకథాన్ వంటి అంశాలను వివరించారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన టీటీడీ పాలకమండలి ఈరోజు సమావేశమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరుగుతున్న ఈ సమావేశంలో మొత్తం 58 అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేసే అవకాశముందని అధికారులు తెలిపారు. దర్శన విధానాలకు కృత్రిమ మేధ వినియోగం అమలు అంశం, సామాజిక, డిజిటల్ మాధ్యమాల వేదికగా టిటిడి పేరిట జరుగుతున్న మోసాలను నివారించేందుకు ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ బోర్డు ఏర్పాటు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని పేదలు, అల్పాదాయ వర్గాలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పన వంటి మార్పులు తీసుకువస్తున్నామన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 150 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలుపుతూ,

వాయిస్ 23 సెకన్లు

---------------------------

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము అన్నారు. కృష్ణా జిల్లా లింగవరం గ్రామంలో 75శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలను పాడి రైతులకు ఈరోజు అందజేశారు. అనంతరం గ్రామంలో సాగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సాగు, త్రాగునీటి వ్యవస్థలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

---------------------------

భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద నీరు చేరుతోంది. దీంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో 20 వేల 748 క్యూసెక్కులుగా ఉంది. కాగా ఈరోజు బ్యారేజీలోని 25 గేట్లు అడుగు మేర ఎత్తి 18 వేల 125 క్యూసెక్కుల నీటిని కాల్వలకు మళ్లిస్తుండగా 2 వేల 623 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక రైతులకు ప్లాట్లు కేటాయించేందుకు ఈరోజు ఈ-లాటరీని నిర్వహిస్తున్నామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ -సీఆర్డీఏ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఆన్ లైన్ ద్వారా ఈ-లాటరీ నిర్వహిస్తున్నామని చెప్పారు. మొత్తం 800 మంది రైతులకు ఒక వెయ్యి 848 ప్లాట్లు కేటాయిస్తామని, వీటిలో ఒక వెయ్యి 82 రెసిడెన్షియల్ ప్లాట్లు, 766 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయని తెలిపారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు స్వల్ప లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 153 పాయింట్ల లాభంతో 82 వేల 354 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 23 పాయింట్ల లాభంతో 25 వేల 113 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతం దాని ఆనుకొని ఉన్న కోస్తాంధ్రప్రదేశ్ మీదుగా ఉపరితల ఆవర్తనం నెలకొని ఉందని అమరావతి భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

=====================